# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ శ్రీలంక అధ్యక్షులు అనురా కుమార దిసనాయకే ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
- ❖ పని ప్రదేశాల్లో ఇతర సాధారణ సౌకర్యాలతో పాటు శిశుగృహ సౌకర్యాన్ని తప్పనిసరి చేశామని కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు.
- ❖ రాజ్యాంగ పరిరక్షణకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- ❖ ప్రఖ్యాత తబలా విద్వాంసులు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిన్న రాత్రి తుది శ్వాస విడిచారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీన ప్రసారమవుతుంది.

======================

శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకే మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఇరువురు ఉమ్మడి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ మాట్లాడుతూ... భారత్ - శ్రీలంక మధ్య ప్రజా సంబంధాలు నాగరికతలతో ముడిపడి ఉన్నాయన్నారు. భారత్ ఇప్పటివరకు శ్రీలంకకు 500 కోట్ల డాలర్ల విలువైన ఆర్థిక సహాయాన్ని అందించిందని తెలిపారు. భారతదేశ ప్రాజెక్టుల ఎంపిక ఎల్లప్పుడూ భాగస్వామ్య దేశాల అభివృద్ధి, ప్రాధాన్యతలపై ఆధారపడి ఉంటుందని ప్రధాన మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

అంతకుముందు ఈరోజు ఉదయం రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో శ్రీలంక అధ్యక్షులకు లాంఛనప్రాయ స్వాగతం లభించింది. అనంతరం అనురా కుమార దిసనాయకే రాజ్‌ఘాట్ చేరుకొని జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణంపై ప్రత్యేక చర్చతో ఈరోజు ఉదయం రాజ్యసభ ప్రారంభమైంది. భావ ప్రకటనా స్వేచ్ఛ, రాజ్యాంగాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... దేశ రాజ్యాంగం పటిష్టంగా ఉందని, కాలపరీక్షకు తట్టుకొని నిలబడిందన్నారు. మహిళా సంక్షేమం, మహిళా రిజర్వేషన్ల కోసం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

చర్చలో పాల్గొన్న ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ... ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలను నెరవేర్చడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పని ప్రదేశాల్లో ఇతర సాధారణ సౌకర్యాలతో పాటు శిశుగృహ సౌకర్యాన్ని తప్పనిసరి చేశామని కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. యాభై అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పని చేస్తున్న పని ప్రాంతాల్లో దీనిని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈరోజు ఆయన లోక్ సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 1961ను సవరించిన తరువాత మహిళా ఉద్యోగులకు ప్రస్తుతం 26 వారాల వేతనంతో కూడిన సెలవులు లభిస్తున్నాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్థాన్‌పై 1971 యుద్ధంలో భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ప్రతీ సంవత్సరం డిసెంబరు 16 న విజయ్ దివస్ ను జరుపుకుంటున్నాం. యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు దేశం ఘనంగా నివాళులు అర్పిస్తోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీర సైనికులకు ఈరోజు నివాళులర్పించారు. ఈ విజయ్ దివస్ ను పురస్కరించుకుని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచారు. కాగా 1971 డిసెంబరు 16న, పాకిస్తాన్ దళాల అధిపతి జనరల్ ఎ.ఎ.ఖాన్ నియాజీ 93 వేల మంది సైనికులతో కలిసి భారత సైన్యం, ముక్తి బాహినితో కూడిన మిత్ర దళాలకు బేషరతుగా లొంగిపోయారు. యుద్ధం ముగింపు ఫలితంగా తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్ గా విడిపోయింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రఖ్యాత తబలా విద్వాంసులు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిన్న రాత్రి తుది శ్వాస విడిచారు. 73 సంవత్సరాల జాకీర్ హుస్సేన్ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలోని ఒక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ.. కన్నుమూశారు. జాకీర్ హుస్సేన్ మృతి పట్ల రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి సంతాపం వ్యక్తం చేశారు. భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చిన గొప్ప మేధావిగా జాకీర్ హుస్సేన్ నిలిచి పోతారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం - శ్రీలంకకు నమ్మకమైన భాగస్వామి అని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పేర్కొన్నారు. శ్రీలంక భారతదేశానికి అత్యంత సన్నిహిత సముద్ర పొరుగు దేశమని విజన్ సాగర్ లో అంతర్భాగమని అన్నారు. ఇరు దేశాలు కూడా వివిధ అనుసంధాన చర్యలను అనుసరిస్తున్నాయని డిజిటల్ కనెక్టివిటీని మెరుగుపరిచడానికి శ్రీలంకలో యూపీఐ సేవలను ప్రవేశపెట్టామని విక్రమ్ మిశ్రీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి 558 లక్షల హెక్టార్లలో పంటల సాగు అవుతోందని వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం తెలిపింది. గత సంవత్సరంతో పోలిస్తే 9 లక్షల హెక్టార్లు ఎక్కువగా అంటే 293.11 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో గోధుమ పంట సాగవుతోందని వెల్లడించింది. 123.27 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుధాన్యాలు, 38.75 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో శ్రీ అన్న ముతక ధాన్యాలు, 91.6 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో నూనెగింజ పంటలు సాగవుతున్నాయని వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి గతి శక్తి పోర్టల్లో ఈశ్రమ్ పోర్టల్ ను అనుసందానం చేస్తున్నామని కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈరోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్, నేషనల్ మాస్టర్ ప్లాన్ పోర్టల్ ఈ రెండు మధ్య సమన్వయాలను మెరుగుపరిచేందుకు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ మార్కెట్లు ఈరోజు నష్టాలతో ముగిసాయి. సెన్సెక్స్ 82 వేల పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైన చివరకు 81 వేల 748 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.05 పాయింట్లతో  24 వేల 668 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు క్షీణించి 84.88 గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో వర్షం కారణంగా మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. అంతకముందు ఈరోజు ఉదయం 406 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో ఇన్నింగ్స్ ప్రారంబించిన ఆస్ట్రేలియా 445 పరుగులకు ఆలవుట్ అయ్యింది. దీంతో భారత్ ఇంకా 394 పరుగుల వెనుకంజలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =